21

# శ్రీశేషుదేవులు సత్యబోధను శిరస్సుపై ధరించేవారు

శ్రీ శేషుబాబు గారికి వైరాగ్యము వలన బాహ్యా వ్యవహారాలన్నింటిపైన ఆసక్తి పోయినది. ఆయనకు ఇష్టమైనది సత్యమును యోచించుట, ఆచరించుట, మాట్లాడుట మాత్రమే. ఆయనలోని సత్యమును ఎప్పుడూ రహస్యముగానే ఉంచేవారు. కాబట్టి ఆయనలోని సత్యయోచనను, సత్యకర్మను గ్రహించుట చాలా కష్టము. సత్యము మాట్లాడుట మాత్రమే పైకి కనిపించేది. సత్యబోధ చెప్పుటను ప్రాణము కంటే ఎక్కువగా ప్రేమించే వారు. ఆయనకు అన్నింటి కన్నా ఇష్టమైనది సత్యబోధయే. సత్యబోధలో నిమగ్నమైతే ఆయనకు ఆకలిదప్పులు, సమయము, పరిస్థితి ఏమీ గుర్తుండేవి కావు. సత్యము మాట్లాడుచున్నంత సేపు ఏకాగ్రతతో తపస్సు చేస్తున్నట్లే ఉండేవారు. ఆయనకు సత్యబోధ అంటే అంత ఇష్టము. సత్యమును తాను బోధించుటలో ఎంత ఆనందిస్తారో, వేరెవరైనా సత్యమును బోధిస్తుంటే వినటానికి కూడా అంతకంటే ఎక్కువగా ఆనందిస్తారు. సత్యమంటే ఆయనకు చాలా భక్తి. తాను సత్యమును మాట్లాడేటప్పుడు చాలా నిష్టగా, ఏకాగ్రతతో పరిశుద్ధముగా ఉండి మాట్లాడేవారు. అలాగే ఎవరైనా సత్యము చెబుతుంటే చాలా వినయముగా, గౌరవముగా ఆనందముగా వినేవారు.

శ్రీశేషుబాబుగారు సత్యమునే దైవముగా నమ్మేడివారు. సత్యబోధ మాట్లాడేటప్పుడు ప్రతి పదము ఆచి, తూచి మాట్లాడేవారు, ఆ వాక్యము యొక్క భావము స్పష్టముగా అర్ధమయ్యేలా పదములను వాడేవారు. తన నోటి నుండి వచ్చే మాటల యెడల ఎంతో భక్తి భావముతో మాట్లాడేవారు. శ్రీ శేషుబాబు గారు సత్యబోధ చెప్పుటలో ఎవ్వరి యెడలా ఎటువంటి తారతమ్యములు పాటించేవారు కాదు. ప్రతి ఒక్కరిని సమానముగా చూసి మాట్లాడేవారు. ధనవంతుడిని–పేదవాడిని, విద్యావంతుడిని–విద్యావిహీనుడిని, మేధావిని–పామరుడిని, మిత్రుడిని – శత్రువుని, బంధువుని – విరోధిని, మంచివాడిని – చెడ్డవాడిని, ఆస్థికుడిని – నాస్థికుడిని, పెద్దవాడిని – చిన్నపిల్లవాడిని, పురుషుడిని – స్త్రీని, నీతిపరుడిని–అవినీతిపరుడిని, పరిశుద్ధుడిని–కపటమైనవానిని అందరినీ అన్నివేళలా సమానముగానే చూచేవారు. ఆయన సత్యమును ఎంతగా ప్రేమించేవారో సత్యము వినేవానిని కూడా అంతగా గౌరవించేవారు. బహుశా సత్యము వినేవారిలోకి భవగంతుడే వచ్చి వినునట్లుగా కాంచేవారేమో అనుకుంటున్నాను. భగవంతుడు సర్వాంతర్యామి కాబట్టి సత్యమును వినువారు ఎటువంటి వారైనను గానీ వారిలో కూడా భగవంతుడినే చూచి భగవంతుడే వచ్చి వింటున్నట్లుగా భావించేవారేమో. తాను చెప్పేవాడినని, ఎదుటివారు వినేవారు అనే భావము ఆయనలో ఏనాడూ చూడలేదు. వినేవారి యెడల ఎంతో గౌరవము, ప్రేమ, ఆదరములను చూపెడివారు. ఎదుటివారి ఇహ పరిస్థితులను బట్టి ఒకరిని ఎక్కువగా

CONTINUE...

గౌరవించడము, ఒకరిని తక్కువగా గౌరవించడము ఏనాడూ చేసేవారు కాదు. బాహ్యస్థితినిబట్టి ఎవరికీ ఏనాడూ ఎట్టి ప్రత్యేకతను ఇచ్చేవారు కాదు. ప్రతి ఒక్కరికి సమానముగానే సత్యమును బోధించెడివారు. సత్యమును బోధించుటలో ఎట్టి అభిమాన ద్వేషములు లేకుండా, ఎవ్వరి యెడల ఎట్టి తార తమ్యములు చూపకుండా, నిష్టతో పరిశుద్ధముగా తపస్సు చేయుచున్నట్లే సత్యబోధ చేసెడివారు.

శ్రీ శేషబాబు గారికి చిన్నతనము నుండి అలవడియున్న నృత్యము, అనుకరణ, హాస్యచతురత వంటి కళలన్నింటినీ సత్యబోధ చేయుటలో ఉపయోగించేవారు, ఆయన బోధలో అర్థం కాని సంస్కృత పదాలో, తికమక పెట్టే వ్యాకరణాలో ఉండేవికావు. అందరికీ అర్థమయ్యే వాడుకభాషలోనే చెప్పెడివారు. భాష్యములు, తర్కములు, వ్యాఖ్యానములు అంటూ అర్థముకాని విషయాలేమీ చెప్పెడివారు కాదు. మనలోని, మన చుట్టూ ఉన్న వ్యక్తులలోని, మనకెదురయ్యే పరిస్థితులలోని సత్యమునే తెలిపెడివారు. అందరికీ తెలిసియున్న, అందరికీ అర్థమయ్యే విషయాలనే ఉదహరిస్తూ బోధ చేసెడివారు. సత్యమును అర్థము అగునట్లు చేయుట కొరకు ఉదాహరణగా ఉపయోగించే వ్యక్తుల యొక్క, పరిస్థితుల యొక్క పద్ధతులను, హావభావములను బాగుగా అనుకరిస్తూ మాట్లాడేవారు. బోధ చేయునపుడు విషయాన్ని అర్థమయ్యేలా చెప్పుటకు ఒక్కొక్కప్పుడు నృత్యాలు కూడా చేస్తూ విషయాన్ని విశదపరచేవారు. శ్రీ శేషబాబు గారికి హాస్య చతురత చాలా ఎక్కువగా ఉండేది. ఎంతసేపైనా జోక్స్ చెబుతూ నవ్వించగలిగేవారు. ఎంతగా జోక్స్ వేస్తున్నాగానీ ఎవ్వరినీ నొప్పించకుండా మర్యాదపూర్వకంగా మాట్లాడేవారు. సత్యబోధను ఎదుటివారు శ్రద్ధగా వినేటట్లు చేయడానికి సత్యబోధలో జోక్స్ కూడా కలిపి వినోదాత్మకముగా సత్యాన్ని బోధించేవారు. అలాగని సత్యబోధలో బాహ్య సంబంధమైన జోక్స్ ఏమీ కలిపేవారు కాదు. సత్య విషయాలనే వినోదాత్మకముగా చెప్పేవారు. చేదుగా ఉండే ఔషదాన్ని తియ్యగా ఉండే టానిక్‌లో కలిపి పట్టించినట్లుగా చేసెడివారు. ఆయన సత్యమును వినోదాత్మకముగా బోధించుచున్నప్పుడు వినేవారు పొట్టచెక్కలయ్యేలా నవ్వుకునేవారు.

సత్యము అనే భగవంతునికి వాక్యము అనే పువ్వులతో జీవితకాలమంతా నిరంతరాయముగా పూజ చేసిన మహాభక్తుడు శ్రీ శేషబాబుగారు.

CONTINUE...

శ్రీ శేషబాబు గారిలో తానే స్వయముగా సత్యమును మాట్లాడుచున్నాననే భావము ఎప్పుడూ ఆయనలో ఉండేదికాదు. భగవంతుని శక్తియే తనలోపల తాత్కాలికముగా ప్రవేశించి మాట్లాడి వెళ్ళిపోతారని ఆ శక్తితోగానీ, ఆ మాటలతోగానీ తనకెట్టి సంబధమూ లేదని దృఢముగా నమ్మెడివారు. అందరికీ అలాగే చెప్పెడివారే కానీ సత్యబోధ కీర్తిని ఏనాడూ తన శిరస్సుపై పెట్టుకోవడానికి ఒప్పుకునేవారు కాదు. ఆ శక్తి చెబుచున్న సత్యవాక్యములకు తానే మొదటి శ్రోతనని భావించెడివారు. సత్యబోధలో ఎవరిని ఉద్దేశించి ఎట్టి విమర్శ వచ్చినాగానీ, ఆ విమర్శ మొదటగా తనకే అన్వయించుకుని స్వీకరించేవారు. సత్యబోధలో ఎవరి మహాపాపమును గూర్చిన విమర్శయైనా వస్తే తానే మహాపాపినని ముందుగా భావించెడివారు. నికృష్టత్వమును గూర్చి విమర్శవస్తే తానే నికృష్టుడనని ముందుగా భావించెడివారు. సత్యబోధలో ఎదురయ్యే ప్రతి విమర్శను ముందుగా తనకే అన్వయించుకుంటూ ఎంతో వినయముతో, గౌరవముతో ఆ వాక్యములను శిరస్సుపై ధరించేవారు. సత్యబోధను ఆయన ప్రాణప్రధముగా ప్రేమించెడివారు. సత్యబోధలో నిమగ్నమైతే నిద్రాహారములు ఏమీ గుర్తుండేవి కావు. సమస్తమూ వదిలేసేవారు. ఆయన సత్యబోధ చేస్తున్న సమయములో ఎవరైనా వచ్చి, ఒక గంట సత్యబోధను ఆపేసి వస్తే కోటి రూపాయలు ఇస్తానని ఆశ చూపించినాగానీ ఆయన ఖచ్చితముగా వెళ్ళరని నిస్సందేహముగా చెప్పగలను. సత్యమును ఆయన అంతగా ప్రేమించినారు. సత్యముతో సమానమైనది ఆయన దృష్టిలో ఇంకేమీ లేదు. సత్యబోధను ఆయన గురువు దైవము అని నమ్మెడివారు. శిష్యుడు గురువు యెడల ఎంతగా వినయ విధేయతలు చూపాలో అంతగాను సత్యము యెడల వినయ విధేయతలు చూపెడివారు. సత్యమును నిష్పక్షపాతముగా, నిర్మొహమాటముగా చెప్పుటలో ఎప్పుడూ ఎవ్వరి విషయములోను అణుమాత్రమైనా రాజీ పడలేదు. ఎందుకనగా సత్యముకంటే ఆయనకు ఎవ్వరూ ఎక్కువ కాదు, ఏదీ ఎక్కువకాదు. సత్యముతో ఆత్మవిమర్శ చేసుకుంటూ తనని తాను అణువణువూ సంపూర్ణముగా విమర్శించుకొనెడివారు. తనకు చేరువైన ప్రతివారిని సత్యబోధలో సత్యబద్ధముగా విమర్శిస్తూ ఆత్మవిమర్శ దానము చేసెడివారు. తనను ఎవరు ఎక్కువగా అభిమానిస్తారో వారిని ఎక్కువగా విమర్శించేవారు. తనకు ఎవరు ఎక్కువ సేవ చేస్తారో వారిని మరింత ఎక్కువగా విమర్శించేవారు.

శ్రీ శేషబాబు గారు పరమతండ్రి యెడల శరణాగతితో భవిష్యత్తును గురించిన బాహ్యకర్మలన్నీ వదిలేసి నిరంతరము సత్యచింతనలోను, సత్యబోధలోనే నిమగ్నమైయుండేవారు. భగవత్ప్రేమ వలన దేవతాశక్తులు ఎవరిలోనైనా ప్రవేశించి, వారు ఆయనకు బాహ్యసేవ చేస్తుంటే వారిని నిష్కర్షగా, నిర్మొహమాటముగా, అత్యధికముగా విమర్శించేవారు. తన వద్ద ఆహారము లేనప్పుడు తనకు ఆహారము పెట్టడానికి వచ్చిన వ్యక్తిని నిర్మొహమాటముగా విమర్శించడానికి ఎంత ధైర్యము ఉండాలో, దేవునిపై ఎంత నమ్మకము ఉండాలో కదా!. ఆహారము పెట్టడానికి వచ్చిన వ్యక్తిని విమర్శిస్తే అతనికి కోపమొచ్చి ఆహారము పెట్టుట మానివేస్తాడేమో అనే భయము అణుమాత్రమైనా లేకుండా ధైర్యముగా సత్యబోధ చేసేవారు. శిష్యులలో చెడు యెడల అభిమానాన్ని ఏ మాత్రము ఉండనిచ్చేవారు కాదు. శిష్యునిలో ఏమాత్రము చెడ్డ అభిమానము మొలకెత్తినా దానిని తీవ్రముగా విమర్శించి కూకటివ్రేళ్ళతోసహా పెకలించేసేవారు.

continue..

శిష్యునిలో ఏ చిన్న చెడు కనిపించినా ఉపేక్షించకుండా విమర్శించేసేవారు. ఎదుటివ్యక్తికి కోపం వస్తుందేమోనని అతని అహము దెబ్బతింటుందేమోనని ఏ మాత్రము మొహమాటపడేవారు కాదు. ఎదుటివ్యక్తి అంతరంగములో నిజమైన తప్పు ఏవిషయములో దాగియున్నదో కనిపెట్టి సరిగ్గా ఆ తప్పునే తీవ్రముగా విమర్శించేవారు. ఒక వ్యక్తి దేహము మీద కారం జల్లితే కొద్దిగానే మండుతుంది కానీ ఆ వ్యక్తి దేహమునకు దెబ్బతగిలి పుండుగా ఏర్పడి నొప్పితో బాధపడుచున్న సమయములో సరిగ్గా ఆ పుండుమీద కారం జల్లితే నొప్పి పెరిగిపోయి విపరీతమైన మంట పుట్టేస్తుంది కదా!. శ్రీ శేషబాబు గారి విమర్శలు కూడా అలాగే గురిచూసి కొట్టినట్లుగా మంట పుట్టించేసేవి. ఆ విమర్శింపబడిన వ్యక్తి యొక్క అహము పూర్తిగా దెబ్బతినేది. జీవితకాలములో మరల ఇంకెప్పుడూ శేషబాబు ముఖము చూడకూడదని ఖచ్చితముగా నిర్ణయించుకుని మాడిపోయిన ముఖముతో అక్కడి నుండి నిష్క్రమించేవాడు. కానీ తదుపరి దేవతాశక్తులు అతనిలో ప్రవేశించి గురువిమర్శ సమంజసమైనదేనని గ్రహించుకునేటట్లు చేసి మరల అతడు మామూలుగా గురువు వద్దకు వచ్చేటట్లు చేసేవారు. శ్రీ శేషబాబుగారికి అత్యంత ఆత్మీయునిగా, అత్యంత చేరువగా ఉన్న మేష్టారు అందరికంటే ఎక్కువగా ఆయనచే విమర్శింపబడినవారైయున్నారు. మేష్టారిలో దేవతాశక్తులు శాశ్వతముగా నిలిచి కర్మచేయుట వలన జీవితకాలమంతా ఆ విమర్శను ఆత్మవిమర్శ ప్రసాదముగా స్వీకరిస్తూ కూడా నమ్మకముతో గురుసేవలో నిమగ్నమైయుండి ధన్యాత్ముడైనారు.

తనకు సేవ చేయుటకు వచ్చిన వారినే విమర్శించే శ్రీ శేషబాబుగారి తత్వము ఎంతటి అమాయకత్వమో కదా ! సత్యబోధయెడల ఆయనకున్న అంకిత భావము, త్యాగము, ధైర్యము నిరుపమానమైయున్నవి. భగవంతుడే రక్షిస్తారు, భగవంతుడే సేవచేస్తారు అని ఆయనకు గల విశ్వాసము అద్వితీయమైనదైయున్నది.

